



రాఖీ స్పెషల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ఆర్టీసీ బస్ స్టాండ్‌లో రాఖీ స్పెషల్ కౌంటర్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ఆర్టీసీ కార్గో కౌంటర్ల ద్వార రాఖీలు వేగంగా, చౌకగా పంపించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బస్ స్టాండ్‌లో స్పెషల్ రాఖీ కౌంటర్‌ను అధికారులు ప్రారంభించారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని అన్ని కార్గో కౌంటర్ల ద్వారా రాఖీలు పంపవచ్చని తెలిపారు. నిర్మల్, మంచిర్యాల, తదితర ముఖ్యమైన బస్ స్టాండ్‌లలో స్పెషల్ కౌంటర్లను ప్రారంభించడం జరిగిందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐ, ఏటీసీలో వాక్ ఇన్ అడ్మిషన్‌లు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాలలో ఏటీసీలో అడ్మిషన్‌ల కోసం వాక్‌ఇన్ అడ్మిషన్‌ల స్పెషల్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 28 వరకు డ్రైవ్ కొనసాగుతోందని, మొదటి, రెండవ విడతలో సీట్లు రాని అభ్యర్థులు సైతం వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు హెచ్‌టీటీపీ://ఐటీఐ.టీఈఎల్‌ఏఎన్‌జీఏఎన్‌ఏ.జీవీ.ఐఎన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లై చేసిన అభ్యర్థులు కళాశాలలో ఉదయం 9 నుంచి 1గంట లోపు హాజరు కావాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజి సెంటర్ (ఏటీసీ)లలో ప్రవేశం కోసం బుధవారం నుంచి ఈ నెల28 వరకు అర్హులైన విద్యార్థులకు వాక్‌ఇన్ అడ్మిషన్స్ కల్పించనున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రొడ్డ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి లేదా 8వ తరగతి వరకు చదువుకున్న వారికి కూడా ట్రేడ్కు అనుగుణంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కనీస వయస్సు 14ఏళ్లు నిండు ఉండాలని, డ్రోన్ టెక్నాలజీ వంటి కొంత మంది కోర్సులకు అర్హతలు వర్తిస్తాయన్నారు. వాక్‌ఇన్ ద్వారా ప్రవేశం పొందాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు తప్పనిసరి అన్నారు. మొదటి మరియు రెండవ దశలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు కూడా వాక్ ఇన్ ఇంటర్వ్యూ సీట్ల కోసం అర్హులన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అభ్యర్థులు తమ ఆసక్తి గల ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలకు హాజరు కావచ్చని, మరిన్ని వివరాలకు ఉట్నూర్ ఐటీఐ, ఏటీసీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్‌గా ఉషారాణి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్‌గా జగదీష్ అగర్వాల్, కో ఆర్డినేటర్‌గా డి.సృజనలను నియమిస్తూ సమితి రాష్ట్ర కన్వినర్ కన్నెబోయిన ఉషారాణి ఉత్తర్వులు జారి చేశారు. ఈ సందర్భంగా సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల రాఘవేంద్ర నాథ్ యాదవ్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. సంస్థ నియమ నిబంధనలను అనుగుణంగా పని చేస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిందుకు నూతన సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బోథ్ ఎమ్మెల్యేకు ఆదివాసీల ఆహ్వానం

నేరడిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలో జరిగే ఆదివాసీ దినోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మంగళవారం ఆదివాసీ సంఘం నాయకులు నేరడిగొండ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నేరడిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆ సంఘాల నాయకు పిలుపునిచ్చారు. మంగళవారం నేరడిగొండ కుమురం భీం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేరడిగొండలో నిర్వహించే ర్యాలీలో అన్ని గ్రామాల ఆదివాసీలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆత్రం గంగారాం. ఆత్రం. నాగేష్ మండలంలోని గ్రామ పటేళ్లు, గ్రామ పెద్దలు, తదితరులు హాజరయ్యారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, పాటిస్తున్న నియమ నిబంధనలపై దృష్టి సారించాలన్న కలెక్టర్ సూచనల మేరకు జిల్లా వైద్య శాఖ అధికారులు పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో మంగళవారం తనిఖీలు జరిపారు. ఆయా ఆస్పత్రుల్లో రికార్డులు పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, డీఐఓ వైసీ శ్రీనివాస్ తో కూడిన బృందం ఆస్పత్రుల్లో తనిఖీలు జరిపి వైద్యులకు విస్తృత సూచనలు చేశారు. ఇందులో భాగంగా సుజాత నర్సింగ్ హోం, శివ ప్రియ నర్సింగ్ హోం లకు నోటీసులు అందించినట్లు అధికారులు తెలిపారు. ఆస్పత్రుల్లో ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని, ఎటువంటి లోపాలున్నా వెంటనే సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచండి

బోథ్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య మరింత పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ ఆర్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని పేర్కొన్నారు. అడ్మిషన్లు పెంచినట్లయితే పేద విద్యార్థులకు తగు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. శంకర్, అధ్యాపకులు లక్ష్మణ్, వనజ, జయరాజ్, నాందేవ్, నగేష్, అనిల్, రాకేష్ లక్ష్మీపతి, ఉదయ రెడ్డి, రవి ఇర్ఫానుల్లా తదితరులు పాల్గొన్నారు.

బార్ ఆధ్వర్యంలో క్రీడలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం న్యాయవాదులతో కలిసి సరదాగా క్యారం ఆడారు. నిత్యంలో విధుల్లో బిజీబిజీగా గడిపే న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు ఉత్సాహంగా గడిపేందుకు ప్రతి ఏటా పోటీలు జరపడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. వీటి వల్ల మనసికోల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయానికి రాకుండానే బాధ్యతలు

● ఉట్నూర్ ఐటీడీఏలోనే ఇన్‌చార్జి తీసుకున్న ఖుష్బుగుప్తా

ఆదిలాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని డీఈవో కార్యాలయానికి రాకుండానే ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా జిల్లా విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు తీసుకోవడం అధికార వరాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జిల్లా డీఈవోగా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇన్నాళ్లు జిల్లా డీఈవోగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి రిలీవ్ కావడంతో మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అదనపు బాధ్యతలు చేపట్టారు.అయితే డీఈవో కార్యాలయంలో అడుగు పెట్టకుండానే ఉట్నూర్‌కు విద్యాశాఖ అధికారులను పిలిపించుకుని ఇన్‌చార్జీ బాధ్యతలు తీసుకోవడం పై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. ఇది వరకే ఖుష్బుగుప్తా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలతో పాటు మున్సిపల్ ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్నారు. తాజాగా జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు తీసుకోవడంతో నాలుగు పదవుల్లో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. తొలిసారిగా ఐఏఎస్ అధికారికి కీలకమైన విద్యాశాఖ బాధ్యతలు అప్పగించడంపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖను గాడిలో పెట్టడం అంతా సులువైన పనేమీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా విద్యాశాఖకు పూర్తిస్థాయి అధికారిని నియమించకుండానే ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యావ్యవస్థ గాడితప్పుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఉదయం ఉట్నూర్ ఐటీడీఏలో జిల్లా విద్యాశాఖాధికారిగా ఖుష్బుగుప్తా బాధ్యతలు స్వీకరించినట్లు ప్రకటించిన అధికారులు.. సాయంత్రం సమయంలో ఖుష్బుగుప్తా డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన వార్తను ప్రచురించ వద్దంటూ ప్రకటించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



డీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఖుష్బుగుప్తా



అటూ.. ఇటూ... చివరికి ఎటో?

ఆదిలాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగడం ఖాయమని తేలిపోవడంతో ప్రధాన పార్టీలు అప్రమత్తమవుతున్నాయి. ఇప్పటికే ముఖ్యనేతలతో మండలాల వారీగా సమావేశాలు, సమీక్షలను నిర్వహిస్తు వస్తున్నారు. పార్టీ బలోపేతం పై నేతలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో ప్రధాన పార్టీల్లో కొత్త చేరికలతో జోష్ కనిపిస్తుంది. ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో నిత్యం పోటాపోటీగా చేరికలు జరుగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుండగా.. జిల్లాలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తుంది. బోథ్‌లో బీఆర్ఎస్, ఆదిలాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీకి కొంత ఇబ్బందికరంగానే మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వలస రాజకీయాలతో మండల, గ్రామస్థాయి ముఖ్య నేతలను తమవైపు తిప్పుకునేందుకు ప్లాన్ చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా ముందుచూపుతో ముందుకెళ్తున్నాయి. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటేందుకు ప్రధాన పార్టీలు మరింత పట్టును బిగిస్తున్నాయి. మండల, గ్రామస్థాయిలో ముఖ్య కార్యకర్తలు రోజుకో కండువాను మారుస్తున్నారు.దీంతో వలస నేతలు అటూ.. ఇటూ.. చివరకు ఎటో? అన్నట్లుగా వ్యవహరించడంతో ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారుతుంది.

- స్థానిక ఎన్నికలే టార్గెట్‌గా జిల్లాలో జోరుగా వలస రాజకీయం
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీల నేతలు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎరవేస్తున్న అధికార పార్టీ
- కాంగ్రెస్‌కు దీటుగా చక్రం తిప్పుతున్న బీఆర్ఎస్, బీజేపీలు
- ఆధిపత్యం కోసం పోటాపోటీగా చేరికలపై నేతల ప్రత్యేక దృష్టి

చేరికలపై స్పెషల్ ఫోకస్

స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడ్డా కొద్ది ప్రధాన పార్టీలు చేరికలపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాయి. ముఖ్యంగా అసమ్మతి, అసంతృప్తిగా కనిపించే నేతలకు గాలం వేస్తూ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చేరికలను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. జిల్లాలో మూడు ప్రధాన పార్టీలు బలంగానే కనిపిస్తున్నాయి. బోథ్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా మారింది. ఆదిలాబాద్ నియోజక వర్గంలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు నువ్వా? నేనా? అంటూ సవాల్ విసురుకుంటున్నాయి. నియోజకవర్గ స్థాయి నేతల పర్యటనల్లో నిత్యం ఎక్కడో ఓ చోట కొత్తగా చేరికలు ఉండే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఒకసారి పార్టీలో చేరిన వారికే మళ్లీ మళ్లీ కండువాలు వేస్తూ సోషల్ మీడియాలో

(తరువాయి 6వ పేజీలో....)

ఈ రెండు ఫొటోల్లో కనిపిస్తున్న వ్యక్తి పేరు.. కేంద్రే మాధవరావు. బోథ్ మండలం చింతలబోరి గ్రామం. ఇతను పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. కానీ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆ పార్టీ నేతలు కండువా వేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మళ్లీ రెండు రోజుల్లోనే మాదవ్‌రావ్ బీఆర్ఎస్ పార్టీలో చేరిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై మాదవరావును ఫోన్‌లో సంప్రదించగా.. ప్రస్తుతం తాను బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా.. బోథ్ నియోజక వర్గంలో మాత్రం పలువురు నేతలు, కార్యకర్తలు జోరుగా కండువాలు మార్చడం హాట్ టాపిక్‌గా మారుతుంది. కొన్ని గ్రామాల్లోనైతే నేతలు పోటాపోటీగా చేరికల కార్యక్రమాలను చేపడుతు ఆధిపత్యం కోసం ఆరాట పడుతున్నట్లు కనిపిస్తుంది.



ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ కండువాతో..



రెండు రోజుల క్రితం కాంగ్రెస్ కండువాతో కనిపిస్తున్న మాధవరావు



వేలిముద్రలు పడని వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి సమాచారం సేకరిస్తున్న పోస్టల్ సిబ్బంది

ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ

తాంసి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల విధానాల్లో కొత్త మార్పులు తెచ్చింది. వేలిముద్రలు, లేదా ముఖభావంతో పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే చాలామంది వృద్ధుల వేలిముద్రలు పడకపోవడంతో వారు పంపిణీ కేంద్రం వద్దకు రాలేని స్థితిలో ఉండటంతో పోస్టల్ సిబ్బంది నేరుగా ఇంటింటికి వెళ్లి వారి వివరాలు సేకరించారు. సేకరించిన వారికి మంగళవారం స్థానిక పోస్టు ఆఫీస్‌లో ఆసరా డబ్బులు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన తాంసిలో 12 మంది వృద్ధులకు సంబంధించిన వేలిముద్రలు పడకపోవడంతో పోస్టల్ సిబ్బంది ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంకా తగ్గడం ఎలా క్రితం వేలిముద్రలు పడని వారికి సంబంధిత కార్యదర్శులు పెన్షన్లను అందించేవారు ఆ నీటి నుంచి పోస్టల్ సిబ్బంది వాటిని అందించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం మీద రెండు మాసాల ఆసరా డబ్బులు ఒకేసారి అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

● కలెక్టర్ రాజర్షి షా ● తాంసిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ ● పీఏసీఎస్ ఎరువుల గోదాముల పరిశీలన

తాంసి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని ప్రతీఒక్కరు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న మందులను, ఆసుపత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. మందులు ఏ మేరకు నిల్వ ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించి అవి ఉపయోగపడతాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. కొన్ని ఆపరేషన్లు చేసేలా కూడా సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. రోగులకు కావాల్సిన బెడ్లు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో సంబంధిత వైద్యులు లేకపోవడం పట్ల ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగి వ్యాధి విషయంపై పూర్తిగా తెలుసుకొని పూర్తిస్థాయి మందులు అందించాలని సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు, తదితరులు ఉన్నారు.

● అధిక మోతాదులో యూరియా వాడితే నష్టమే..

తాంసి: రైతులు వారి పంటలకు అధిక మోతాదులో ఎరువులు వాడితే నష్టమే తప్ప లాభాలు ఉండవని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. మోతాదుకి మించి వాడవద్దని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పంపిణీ చేసే పిఎసిఎస్ ఎరువుల గోదాములను ఆయన పరిశీలించారు. ముందుగా ఇప్పటి వరకు ఎన్ని బస్తాల యూరియా పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎంత నిల్వ ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పిఎసిఎస్‌లో ఎంతమంది రైతుల ఖాతాలకు రుణమాఫీ వర్తించిందో వివరాలు అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు లక్షల 40 వేల ఎకరాలలో పంటలు సాగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం జిల్లాకు 36 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని ఎక్కడ కూడా యూరియా కొరత లేదని అన్నారు.



తాంసిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా



ఎస్టీయూ భవన్‌లో జాబ్ మేళాకు భారీ ఎత్తున హాజరైన నిరుద్యోగులు

● అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలి

ఆదిలాబాద్ టౌన్: యువత ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీయూ భవన్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 34 ఐటీ, నాన్ ఐటీ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొనగా... జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా నిరుద్యోగ అభ్యర్థులు తరలివచ్చారు. ఉదయం నుంచే జాబ్ మేలా ప్రాంగణం అభ్యర్థులతో కిట కిట లాడింది. జాబ్ మేళా గురించి అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పించడం సత్ఫలితాలను ఇచ్చింది. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అభ్యర్థులు తమ బయోడేటాలను కంపెనీల ప్రతినిధులకు అందచేయగా...వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

ఘనంగా కంది శ్రీనివాస రెడ్డి జన్మదినం

● రక్తదాన శిబిరంలో పాల్గొని అభిమానాన్ని చాటుకున్న నేతలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని, జనం ఆశీస్సులతోనే ఇంతటి అభిమానాన్ని పొందగలిగాగని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం కంది శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పట్టణంలోని ప్రజా సేవా భవన్ లో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, పార్టీ నేతలు, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన భారీ కేక్ కట్ చేశారు. అనంతరం నేతలు భారీ గజమాలతో సత్కరించారు. పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అదే ఆవరణలో అభిమానులు లడ్డూలతో కంది శ్రీనివాస రెడ్డికి తులాభారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో నేతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తనపై అభిమానంతో భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఇంత మంది ప్రజల అభిమానాన్ని సంపాదించడం ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్య ల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక ఎన్నికలలో అంతా కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థుల ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవఆ సమితి రాష్ట్ర అధ్యక్షు సోయం బాపూరావు, పార్టీ నేతలు గిమ్మ సంతోష్, జహీర్ రంజాని, షకీల్, కలాల శ్రీనివాస్, లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.



కందికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత కలాల శ్రీనివాస్



సతీమణితో కలిసి కేక్ కట్ చేస్తున్న కంది శ్రీనివాస రెడ్డి



లడ్డులతో తులాభారం వేస్తున్న పార్టీ నేతలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలి

ఉట్నూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలో ఉన్న స్థానిక సంస్థలలో బీజేపీ కైవసం చేసుకుని విజయ డంకా మోగించాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా ప్రభారి బసవరాజు లక్ష్మి నరసయ్యహాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని విజయ పదంలో నడిపించే విధంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సాడిగే గంగన్న, మాజీ ఎంపీపీ ఆడే ధన్‌లాల్, బానోతు జగన్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, ఉట్నూర్ బీజేపీ మండల అధ్యక్షులు బింగి వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజి, కొలిపాక రాజశేఖర్, బొడ్డుకిరణ్, మహిళ మోర్చ రాష్ట్ర నాయకురాలు రాతోడ్‌సుమన్‌బాయి, మండల ప్రధానకార్యదర్శి చిలివేరి రవీందర్,రాథోడ్ శేషారావు,సాడిగేరాజేశ్వర్, ఉస్కేమల్ల దేవదాస్,కందుకూరి రమేష్, పొన్నం జగన్, భగీర్థ, విజయ్, విఠల్, రాథోడ్ తదితర పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్

ఖానాపూర్: మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలనే నినాదంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర ప్రజలను నిండా ముంచిందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, జిల్లా నాయకులు భూమన్న, తిరుమలగిరి స్వామి, పవన్, సురేష్, తదితరులున్నారు.

ఇంద్రవెల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ దీపిక్ సింగ్ శేకవత్,బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేవపూజ్ మారుతి, ఖానాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఆరేళ్లి రాజలింగం, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, మాజీ ఎంపిటిసి కోవా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి కనక హనుమంతు, ఉపాధ్యక్షులు ముండే రాజేశ్వర్, నాయకులు మోరే దిలీప్, పాల్గొన్నారు.

సోన్: బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'ఇంటింటికి బీజేపీ - ప్రతి గడపకు బూత్ అధ్యక్షుడు' అనే కార్యక్రమంలో మంగళవారం సోన్ మండల కేంద్రంతో పాటు మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప ్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షులు గణేష్, సీనియర్ నాయకులు మేకల అశోక్, ముత్యం రెడ్డి, నర్సారెడ్డి, సొన్నపేట గంగారెడ్డి, మేకల మల్లేష్, భోజారెడ్డి, హనుమంత్, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

● మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ

తాంసి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని మండల ప్రతేక అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని బంధాలనాగాపూర్ లో ఉన్న బాలికల వసతి గృహం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈయనతో పాటు ఎంపీఓ లింగయ్య తదితరులు ఉన్నారు.

పోడు రైతుల పట్ల మొండి వైఖరి వీడాలి

ఖానాపూర్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం చేసుకునే రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మొండి వైఖరి వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాగలి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నాయకులు సంచుల నారాయణ, బాధిత రైతు బోసు భూమన్న, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు

నే రడిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఇచ్చోడ మండలంలోని ధర్మపురి గ్రామస్థులు చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆడే గజేందర్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారిలో కాంబ్లే దశరథ్, పాండురంగ, కాంబ్లే దయానంద్, పుండలిక్, తాతే రావు, దేవురావు, ఉద్ధవ్, చంద్రకాంత్, విఠల్, నారాయణ్, జనార్దన్, శివాజీ ,ఏలేటి రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్‌లో పురస్కారం

ఉట్నూర్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలులో ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అత్యుత్తమంగా నిలిచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌చేతుల మీదుగా పురస్కారం పొందిన ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను మంగళవారం కార్యాలయ పరిపాలన అధికారిదామోదర స్వామి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం నాగభూషణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుకు అంత్యక్రియలు

తాంసి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా పెంచుకున్న ఎద్దు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. 30 సంవత్సరాల పాటు ఆ ఎద్దుతో సేవలు చేయించుకున్న ఆ రైతు సాంప్రదాయ బద్ధంగా ఆ ఎద్దుకు అంత్యక్రియలు చేసిన సంఘటన చోటు చేసుకుంది. వయోభారం కావడంతో మంగళవారం మధ్యాహ్నం ఆ ఎద్దు మృతి చెందింది. సాయంత్రం వేళలో ఆ ఎద్దకు అంత్యక్రియలు నిర్వహించారు.

కడెం కాలువలో గుర్తు తెలియని మృతదేహం

దస్తురాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామ శివారులోని కడెం ఎడమ ప్రధాన కాలువలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వాడిగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి

బజార్‌హత్నూర్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన పట్ల మల్లయ్య (60) అనే వృద్ధుడుప్రమాదవశాత్తుగా మంగళవారం బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...మల్లయ్య గత కొన్ని రోజులుగా మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు తెలిపారు. కాగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లయ్య గ్రామ సమీపంలోని బావిలో పడి చనిపోయినట్లు పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సొంత ఖర్చులతో కాలనీ వాసులకు నీటి సౌకర్యం

ఖానాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐదవ వార్డు పరిధిలో నెలకొన్న నీటి సమస్యను ఆ వార్డు మాజీ కౌన్సిలర్ దంపతులు సొంత ఖర్చులను వెచ్చించి పరిష్కరించారు. ఐదవ వార్డు పరిధిలోని కరీం కాలనీలో నీటి సమస్య తలెత్తడంతో కాలనీ వాసులు ఆ వార్డు మాజీ కౌన్సిలర్ పరిమి లత సురేష్ దపంతుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వసేఖాన్, ఫిరోజ్ భాయ్, అమీర్ ఖాన్, మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బంది, ఎలక్ట్రిసిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హామీలను నెరవేర్చాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని యూఎస్‌పీసీ నేతలు కె.కిష్టన్న, ఎ.భుజంగ్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయ ఘాల ప్రతినిధులు అశోక్, జ్ఞానేశ్వర్, లక్ష్మణ్ రావ్, సూర్య కుమార్, సురేఖ, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నేరడిగొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విష ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి హరీశ్ రావు ఇస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంగళవారం నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్య జాన్సన్ నాయక్, నిర్మల్‌ఇంచార్జి రాంకిషన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అనిల్ వీక్షించారు.

తహసీల్దార్ ఎదుట డీజే ఓనర్ల బైండోవర్

తలమడుగు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పండుగల సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండ్స్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాధికా తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు తలమడుగు మండలంలోని డీజే ఓనర్స్ అందరిని తలమడుగు పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి వారికి రాబోతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే తలమడుగు మండలంలోని డిజే ఓనర్స్ అందరిని తహసీల్దార్ ముందర బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

గుడుంబా అమ్ముతూ పట్టుబడిన వ్యక్తికి జరిమానా

దిలావర్‌పూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతిఇ) : మండలంలోని దిలావర్‌పూర్ తండాకు చెందిన జాదవ్ వినేష్ అనే వ్యక్తి పలుమార్లు గుడుంబా అమ్ముతూ పట్టుబడితే స్థానిక ఎమ్మార్వో వద్ద బైండోవర్ చేసినా తీరు మార్చుకోలేదు. పలుమార్లు బైండోవర్ ఉల్లంఘిస్తూ తిరిగి మళ్లీ గుడుంబా అమ్ముతూ మంగళవారం పట్టుబడ్డాడు. దీంతో సదరు వ్యక్తిని ఎమ్మార్వో ముందు హాజరుపరచగా ఆ వ్యక్తికి రూ. 3,500ల జరిమానా విధించారు. జరిమానా డబ్బులను చెల్లించినట్లు ఎక్సైజ్ ఎస్సై బి. గజేందర్ తెలిపారు.

ఇచ్చిన హామీల అమలులో బీజేపీ విఫలం

ఖానాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పదేళ్ల పాలనలో చేసిన అవినీతి సొమ్మును పంచుకునేందుకు కుటుంబ కలహాలను పెట్టుకుంటూ బీఆర్ఎస్ సతమతమవుతోందని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు విశ్వసించకపోవడంతోనే వారు జనహిత పాదయాత్రపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మతం పేరిట సిచ్చు పెడుతూ బీజేపీ, పదేళ్ల పాలనలో అవినీతితో బీఆర్ఎస్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాయన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు సన్న బియ్యం లాంటి హామీ ఇవ్వని సంక్షేమ పథకాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును పరిశీలించేందుకే కాంగ్రెస్ పార్టీ నాయకత్వం జనహిత పాదయాత్రను చేపట్టిందన్నారు. శివాజీ మహారాజ్ కేవలం బీజేపీ సొత్తులాగా భావించవద్దని ఆయనపై ప్రతి ఒక్కరికి అభిమానం ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఇకనైనా ఈ రెండు పార్టీలు తమ తీరును మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో వాటికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ తోట సత్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మున్సిపల్లి మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, శెట్టి శ్యామ్మోహన్ రావు, పోలంపల్లి సచిన్, జంగిలి శంకర్, జన్నారపు శంకర్, మదిరే సత్యనారాయణ, ద్యావతి రాజేశ్వర్, షౌకత్ పాషా, శేషాద్రి, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



రంగవల్లులు వేస్తున్న మెడికోలు

నిర్మల్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ మంగళ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పుట్టిన శిశువులకు ముర్రుపాలు తాగించడంతో శిశువులో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

పెంబి: మండలంలోని రాముగూడ గ్రామంలో కొలంగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు, ఉపాధ్యాయులు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్ టౌన్: తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని రిమ్స్ ఎస్ఎన్‌సీయూ ఇన్‌ఛార్జ్ డా.అనంత్‌రావు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో రంగోలి పోటీలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేసేలా మెడికోలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రిన్సిపల్ విద్య విల్సన్, వైస్ ప్రిన్సిపల్ సరోజ,రత్న కుమారిలు వ్యవహరించారు.

లక్ష్మణచాంద: ముర్రుపాలే పసిబిడ్డకు మొదటి వ్యాధి నిరోధక శక్తి వ్యాక్సిన్ అని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సుజాత, గురాల ఇందిరా,పాల్గొన్నారు.

ఉట్నూర్: అప్పుడే పుట్టిన పసి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సీడీపీఓ ఉమాదేవి అన్నారు.మంగళవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా పెర్కగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఈ విషయమై మండల అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిబ్బంది అందించారు గర్భిణీ స్త్రీలకు పిల్లలకు పోషకాహారం సరిగా అందడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మున్సిఫ్ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

బస్సులో దొరికిన బ్యాగ్ అప్పగింత

నిర్మల్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ నుండి నిర్మల్ వస్తున్న బస్సులో ఒక బ్యాగ్ దొరికింది. కండక్టర్ గమనించి నిర్మల్ డిపోలో అప్పగించినట్లు డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. డిపో అధికారులు అది తెరిచి చూడగా 7 గ్రాముల బంగారు చైన్, ఎంఐ సెల్ ఫోన్, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు ఉన్నాయని, ఆధార్ కార్డుపై ఉన్న సెల్ ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి సదరు వ్యక్తిని పిలిపించి వివరాలు అడుగగా మేము బస్సులో ఎక్కి బ్యాగ్ పోయిందని దిగిపోయామని చెప్పారు. డిపో క్యాషియర్ ఎన్ఆర్. శేఖర్ బ్యాగును అప్పగించినట్లు తెలిపారు. బ్యాగును భద్రంగా అప్పగించిన కండక్టర్ విలాస్‌ను డిపో మేనేజర్ అభినందించారు.

ప్రాణాపాయ స్థితిలో జీపీ కార్మికుడు

కుభీర్,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో విద్యుత్ షాక్‌కు గురయి జీపీ కార్మికుడు ప్రాణాపాయ స్థితికి చేరిన ఘటన మంగళవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన అంబదాస్ అనే గ్రామపంచాయతీ కార్మికుడు నాయాబాది కాలనీలో బోరుమోటరు సరిచేస్తున్న క్రమంలో 11కేవీ విద్యుత్ తీగలకు మోటరు పైపు తగిలి విద్యుత్ షాక్ గురయ్యాడు. గమనించిన జీపీ కార్మికులు గ్రామస్థులు వెంటనే ప్రయివేటు వాహనంలో భైంసా పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స నిర్వహించిన వైద్యులు తలకు తీవ్ర గాయమైందని అన్నారు.విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి గౌతం అక్కడికి వెళ్లి ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బజార్‌హత్నూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పడిపెల్లి విలాస్ (52) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి...ఎస్సై సంజీవ్ కుమార్,కుటుంబీకుల వివరాల ప్రకారం...పడిపెల్లి విలాస్‌కు చెందిన 30 గుంటల వ్యవసాయ భూమితో పాటు ఇతరుల భూమిలో వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం గడిపేవాడు. ఇదిలా ఉండగా ఇటీవల తన కూతురు వివాహం కోసం రూ.5లక్షలు అప్పు చేశాడు.చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడి క్షణికావేశానికి లోనై ఎవరు లేని సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జూనియర్ కళాశాలలో టీజీబీఐఈ ఆకస్మిక తనిఖీ

బజార్హత్నూర్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తెలంగాణ స్టేట్‌బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలను గుర్తించి వారి రద్దు చేయాలి

నిర్మల్‌రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేస్తున్న సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలను గుర్తించి వారి హాస్పిటల్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రగతి శీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల జిల్లా వైద్య అధికారికి డాక్టర్ నైనాకి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి పై పోక్సో కేసు

తాంసి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తాంసి మండల కేంద్రంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు అయింది. తాంసి ఎస్సై జీవన్‌రెడ్డి వివరాల ప్రకారం మండ కేంద్రంలో ఓ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్ చేస్తూ వేధింపులకు గురిచేశాడు. ఈవిషయమై విద్యార్థులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి ఉపాధ్యాయుడిని రిమాండ్‌కు తరలించారని ఎస్సై తెలిపారు.

తరోడాలో ఒకరి హత్య

● వేధింపులు భరించలేక అల్లుడిని చంపిన అత్త



వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

ముథోల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని తరోడా గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన హత్య ఇక్కడి ప్రాంతంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్ నగర్‌కు చెందిన ఎస్‌కే నజీమ్(45) అనే వ్యక్తి ఉపాధి కోసం కొన్ని సంవత్సరాల క్రితం తరోడా గ్రామానికి ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చాడు. ఇక్కడే స్థిరపడ్డారు. మృతుడు, భార్య, పిల్లలు, అతని అత్తమ్మ కలిసి ఒకే ఇంటిలో నివసిస్తున్నారు. వర్షాకాలం రావడంతో ఇటుక బట్టీ పనులు జరుగకపోవడతో ఇంటి వద్దనే ఉంటున్నారు. సోమవారం మృతుడి భార్య మహారాష్ట్రలోని ఓ గ్రామానికి వెళ్లింది. అయితే మృతుడు సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇంట్లో అత్త ఒక్కతే ఉండటంతో ఆమెను వేధిస్తూ గొడవకు దిగాడు. దీంతో సహనం నశించిన రహీమున్నిసా కర్రతోని అల్లుడైన ఎస్‌కే నజీమ్‌పై దాడి చేసి నెట్టేసింది. దీంతో ఎస్‌కే. నజీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో కూడా మృతుడు భార్యను, అత్తను వేధించేవాడు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సెస్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య ఎస్‌కే. సాహిబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నేరడిగొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడా మండలం సల్యాద గ్రామానికి చెందిన చిక్రం సోమేష్ (23) మృతి చెందాడు. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం ఇచ్చోడ మండలం సల్యాదకు చెందిన ఇద్దరు యువకులు చిక్రం సోమేష్ తొడసం హన్మంతు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాయాదరి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనం పై తిరిగి వస్తుండగా మండలంలోని ఆరేపల్లి - కొరటికల్ జాతీయ రహదారి మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో చిక్రం సోమేష్ అక్కడికక్కడే మృతి చెందగా. తొడసం హన్మంతుకు తీవ్రగాయాలు కాగా వారిని నిర్మల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిర్మల్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మల్లన్న గుట్ట సుబ్రహ్మణ స్వామి ఆలయానికి మంగళవారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి, గురుస్వామి శంకర్ తెలిపారు.

వరి పంట పరిశీలన

సోన్,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ గ్రామ శివారులో గల వరి పంటను మండల వ్యవసాయ అధికారి జి. వినోద్ కుమార్ పరిశీలించారు.ఈకార్యక్రమంలో ఏఈవోరైతులు ఉన్నారు.

అటూ.. ఇటూ.. చివరికి ఎటో?

(5వ పేజీ తరువాయి...)

వైరల్ చేసుకుంటున్నారు. ఇంకా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషనే రాలేదు. అయిన ప్రధాన పార్టీలు ఎంతో హడావిడి చేస్తూ స్థానిక రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి.

అధికారం అండతో..

గత ఎన్నికల్లో జిల్లాలో ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ అధికారం అండతో మరింతగా బలపడేందుకు ఆరాట పడుతుంది. ముఖ్యంగా అభివృద్ధి,సంక్షేమ పథకాలతో పాటు నామినెట్ పదవులతో ఆశావహ నేతలకు ఆ పార్టీ నేతలు ఎరవేస్తున్నారు. ఇటీవల బోథ్ మండలం చింతలబోరి గ్రామానికి చెందిన ఓ బీఆర్ఎస్ కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆశచూపి పార్టీలో చేర్చుకున్నారన్న ఆరోపణలు వస్తున్నా యి. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా బరిలో దింపుతామంటూ హామీలు ఇస్తూ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, పొలంబాట,ఈజీఎస్ అభివృద్ధి పనులను ఆశచూపుతూ అధికార పార్టీ చేరికల పై ప్రత్యేకదృష్టిని సారిస్తుంది.

దూసుకుపోతున్న ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ పార్టీకి దీటుగా చక్రం తిప్పుతున్న జిల్లా ఎమ్మెల్యేలు మరింత దూకుడుతో ముందుకెళ్తున్నారు. అవకాశం ఉన్నచోట కాంగ్రెస్‌కు చెక్‌పెట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన దిశా సమావేశంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు కనీస సమాచారం ఇవ్వకుండానే ఇందిరమ్మ ఇళ్లకు మార్కెట్ ఇవ్వడంపై ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అధికారుల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆదిలాబాద్ నియోజక వర్గంలో ఎమ్మెల్యేకు సమాచారం లేకుండానే బేల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడంపై ఎమ్మెల్యే పాయలశంకర్ తీవ్రంగా మండిపడ్డారు. రెండు నియోజక వర్గాల్లోనూ ఇన్‌చార్జీలు వర్సెస్ ఎమ్మెల్యేలు అన్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్ని సందర్భల్లో అధికారుల బదిలీలు,అభివృద్ధి పనుల మంజూరు పై అధికార, ప్రతిపక్షాల మధ్య చిన్నపాటి వాగ్వాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. మొత్తానికి అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా ఎమ్మెల్యేలు చక్రం తిప్పుతు పాలనలో దూసుకెళ్లడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాక

తానూర్,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ఎమ్మెల్యే రామరావుపాటిల్‌లు రానున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు పుండ్ర లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో బుధవారం సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్న ఇంటింటికి బీజేపీ అనే కార్యక్రమంలో భాగంగా పాల్గొనడానికి వస్తున్నారని తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, బూత్ అధ్యక్షులకు, మండల పదాధికారులకు, సీనియర్ నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మహాలక్ష్మీ ఆలయ నిర్మాణం కోసం ప్రొసీడింగ్ అందజేత

తానూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాలింగి మహాలక్ష్మీ ఆలయానికి 30లక్షలు నిర్మాణం కోసం దేవాదాయ శాఖ నుండి నిధులు మంజూరు కావడంతో మంగళవారం ఎమ్మెల్యే రామారావుపాటిల్ తన నివాసంలో గ్రామస్తులకు ప్రొసిడింగ్ కాపిని అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, మాజీఎంపీటీసీ విఠల్, వీడీసీ అధ్యక్షుడు నాగనాథ్, అవధూత్ యోగేష్, యువరాజ్, వీడీసీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కంకణబద్ధులులై పాటుపడాలి

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా నియోజక వర్గ పరిధిలో పార్టీ పటిష్టతకు కాంగ్రెస్ సేవాదళ్ కమిటీలన్నీ కంకణబద్ధులై పాటుపడాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఇందులో సేవాదళ్ ముథోల్ నియోజక వర్గ అధ్యక్షులు కదం ఆత్మారామ్‌తోపాటు నియోజక వర్గ పరిధిలోని ఆయా మండలాల, భైంసా పట్టణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుగుట్ట నుంచి బోథ్ పొలంబాట

బోథ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామం నుండి బోథ్ వరకు పొలం బాట కార్యక్రమంలో భాగంగా 15 లక్షల రూపాయలు మంజూరు కావడంతో మంగళవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారి ప్రభాకర్ వెంట బోథ్ ఆత్మ చైర్మన్ జి. రాజు యాదవ్ ఉన్నారు.అడగగానే నిధులు మంజూరి చేయించినందుకు గాను ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ ఈ సందర్భంగా గ్రామస్తులు సన్మానించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేసుకోవాలి

● వారం వారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు: ఆడే గజేందర్

నేరడిగొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని, వారం వారం లబ్దిదారుల ఖాతాలో డబ్బులు వస్తాయి అని అన్నారు. మండలంలోని చింతగూడ, బండ్ల గూడ, నంద్యానాయక్ తండా గ్రామాలలో మంగళవారం పర్యటించి పలు సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఆడే గజేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, మాజీ ఎంపీపీ ప్రేమ్ సింగ్, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, సాబ్లే కైలాష్, బోథ్ ఆత్మ డైరెక్టర్ సాబ్లే అందు సింగ్, డైరెక్టర్ పులి సురేష్, సాబ్లే కేవల్ సింగ్, గంగారాం, రెడ్డి, పటేల్ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖానాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. మంగళవారం మండలంలోని సత్తెనపల్లి, సేవ్య నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. ఆయన వెంట స్థానిక ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆవా కార్యకర్తలు, తదితరులున్నారు.

గిరిజన గ్రామాల విద్యుత్ ఏర్పాటుకు సర్వే

పెంబి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిరిజన గ్రామాలైన సోముగూడ, చాకిరేవు, కొసగుట్ట, రావి, కొత్తగూడ, గుమ్మెన, ఎంగ్లాపూర్, గోరి పెద్దయ్యగూడెం, ఒడ్డెగూడ, గోధుమల గ్రామాలకు విద్యుత్ సింగిల్ ఫెస్, త్రీఫేస్ కరెంటు కొరకు మంగళవారం విద్యుత్ శాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ఏర్పాటుకు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ నాగిని భాను, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ శివ కుమార్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, పెంబి మండల అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్ ఇన్స్‌పెక్టర్ రమేష్, తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

ఖానాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల లబ్ధిదారులకు అధికారులు మంగళవారం నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కొత్త రేషన్ కార్డులతో పాటు కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు వార్డు అధికారి సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీం ఖాన్, మెప్మా ఆర్పీ నారాయణ, తదితరులున్నారు.

ఢిల్లీకి తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ఖానాపూర్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):42శాతం బీసీరిజర్వేషన్ల సాధనకోసం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో బుధవారం జరగనున్న నిరసన కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గం నుండి పలువురు కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం బయలుదేరారు. ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కడెం మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్, ఆత్మ కమిటీ సభ్యులు రాజశేఖర్, దస్తురాబాద్ బీసీ సెల్ మండల అధ్యక్షులు చుంచు వెంకన్న, తదితరులు ఢిల్లీకి తరలి వెళ్లారు.

ఆయిల్ పామ్ సాగుకు పరస్పర అంగీకార పత్రం అందజేత

లక్ష్మణచాంద, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంట వేసిన రైతులకు ప్రీ యూనిక్ కంపెనీ నుండి పరస్పర అంగీకార పత్రం అందజేయడం జరిగిందని ఏఈవో పవిత్ర మంగళవారం తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పవిత్ర, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ ఆఫీసర్ మహమ్మద్ జాకీయోద్దీన్, గుండా విష్ణు, రైతులు పాల్గొన్నారు.



కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌లలో భోజనం చేస్తున్న విద్యార్థులు



భైంసా కళాశాల ఇంటర్ విద్యార్థులు

ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం మిథ్యేనా?

- హామీలకే పరిమితవుతున్న పథకం
- జిల్లాలో ఆచరణకు నోచుకోని వైనం
- మధ్యాహ్న భోజనం కోసం ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థులు

భైంసా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల్లోనూ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి సీఎం కేసీఆర్ సైతం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని వాగ్దానం చేసినా అమలు కాలేదు. ప్రభుత్వం, పాలకులు మారిన నేపథ్యంలో పథకం ఆచరణలోకి వస్తుందని ఆశపడిన ఇంటర్ విద్యార్థుల ఆశలు అడియాశలయ్యాయి. గతప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం సైతం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు హామీలకు, ప్రకటనలకే పరిమితం చేసిందే తప్ప ఆచరణలోకి తేలేదు. ఫలితంగా సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ఇంటర్ చదువుల కోసం జూనియర్ కళాశాలలకు వస్తున్న విద్యార్థులకు పాట్లు తప్పడం లేదు.

జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జిల్లాలో 18 మండలాలు ఉండగా 13 కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన బాసర్, నర్సాపూర్ (జీ), పెంబి, సోన్, దస్తూరాబాద్ మండలాల్లో నేటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదు. ఇక 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,561, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,460 మంది కలిపి మొత్తం 5,021 మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. గతేడాదితో పోల్చి చూస్తే ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పెరిగాయి.

దూర ప్రాంతాల వారికి ఇబ్బందులు

ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా కళాశాలలకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నవారే. ఉదయాన్నే బస్సును అందుకోవాలంటే పొద్దున్నే ఇంటిని బయల్దేరాల్సి ఉంటుంది. దీంతో ఉదయం ఇళ్లలో సరిగా తినకుండా కళాశాలకు వచ్చేస్తున్నారు. కొందరి ఇళ్లలో భోజనం తయారు కాకపోవడంతో మధ్యాహ్న భోజనం కూడా తెచ్చుకోవడంలేదు. ఆయా కళాశాలల్లోని కొద్దిమంది విద్యార్థులు తమ ఇళ్ల నుంచి మధ్యాహ్న భోజనం కోసం టిఫిన్ బాక్స్‌లను తెచ్చుకొంటున్నారు. దీంతో ఉదయం వచ్చిన ఇంటర్ విద్యార్థులు సాయంత్రం వరకు బయటకు వెళ్లకుండా తరగతులు వినాల్సివస్తోంది. అర్ధాకలితో తరగతులకు హాజరు అవుతూ చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. బిస్కెట్లు, పండ్లు తిని నీళ్లు తాగి కడుపు నింపుకొంటున్నారు.

అమలైతే తగ్గనున్న డ్రాపౌట్స్

ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలలకు హాజరయ్యే పరిస్థితులు నెలకొంటాయి. అంతేకాకుండా డ్రాపౌట్స్ తగ్గే పరిస్థితులుంటాయి. సాయంత్రం వరకు తరగతులు కొనసాగించేందుకు వీలుంటుంది. ఉత్తీర్ణతా శాతం కూడా మెరుగు పడే అవకాశాలు అధికంగా ఉంటాయి.

మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలి



● అంకిత, ఇంటర్ విద్యార్థి, భైంసా

ప్రభుత్వం ఇది వరకు ప్రకటించినట్టుగానే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే ప్రారంభించాలి. విద్యార్థులను ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి కాలయాపన విధానాలకు తావులేకుండా ప్రారంభించే చర్యలు చేపట్టాలి.

హామీలకే పరిమితమైన ప్రభుత్వం



● గంగాప్రసాద్, ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్

కాంగ్రెస్ సర్కారు విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కేవలం ప్రకటనలకే పరిమితం చేస్తోంది. ప్రభుత్వం ఇకనైనా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



● జాదవ్ పరుషురామ్ నాయక్, డీఐఈవో, భైంసా

జూనియర్‌కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం అడిగి నివేదికలు ఇవ్వడం వరకే మా బాధ్యత. మధ్యాహ్నభోజన పథకం అమలైతే విద్యార్థులకు ప్రయోజనకరం.

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు

- కబడ్డీ ఆట ఆడీ పోటీలను మొదలెట్టిన ఎమ్మెల్యే రామరావ్ పాటిల్
- జ్యోతి ప్రజ్వలన గావించిన శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రతినిధులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

భైంసా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భైంసాలో మంగళవారం శ్రీసరస్వతీ విద్యాపీఠం రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జ్యోతిప్రజ్వలన, పోటీల ఉద్ఘాటన కార్యక్రమ అనంతరం ఆటలను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో స్వయంగా కబడ్డీ ఆట ఆడిపోటీలను ప్రారంభించారు. చిన్నారులు చేపట్టిన కూచిపూడి, భారత నాట్యప్రదర్శనలు ఆహూతులు, అతిథులను విశేషంగా ఆలరారించాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేయ్యి పైగా మంది శ్రీసరస్వతీ శిశు మందిర్ విద్యాసంస్థలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు.

శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు: ఎమ్మెల్యే

విద్యార్థులకు నైతికతో కూడిన విద్యతో పాటు సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాలకు శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యాసంస్థలు నిలయాలుగా నిలుస్తున్నాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. రోజురోజుకు అంతటా పాశ్చత్యదోరణి విధానాలు, ఆధునిక పోకడలు సంతరించుకుంటున్నాయన్నారు. కానీ శిశుమందిరాల్లో మాత్రం సంస్కృతి, సంప్రదాయలు పరిడవిల్లే రీతిలో, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా నిర్వహణ వ్యవస్థ కొనసాగడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రధాన వక్తగా హాజరైన శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావ్ మాట్లాడుతూ ఆటల ద్వారా మానసిక ఉల్లాసం కలుడమే కాకుండా ఒత్తిడి దూరమవుతుందన్నారు. ఇందులో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావ్, ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు జిల్లా ప్రముఖ్ డా.దామోదర్ రెడ్డి, అర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ సునీల్ బాబుతోపాటు పలువురు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడుతున్న నలుగురి అరెస్టు

● ఏకకాలంలో పది బృందాలతో పోలీసుల తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడే వారి ఆట కట్టించాలన్న ఉద్దేశంతో జిల్లావ్యాప్తంగా పోలీసులు ఏకకాలంలో తనిఖీలు జరిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనల మేరకు పది బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టగా ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలో ఒకరు, మావల పరిధిలో ఇద్దరు, తాంసి మండల పరిధిలో ఒకరిపై కేసు నమోదుచేసి వారి నుంచి ఆయుధాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. షోయబ్ అఫ్జల్, షేక్‌షరీఫ్, ఆత్రం మారుతి, ఆత్రం భీంరావును అదుపులోకి తీసుకుని ఒక డబల్ బోర్ గన్, ఒక ఎయిర్ గన్, జింక కొమ్ములతో కూడిన తల, వేటకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని, అసాంఘిక కార్యకళాపాళపై డయల్ 100 లేదా 8712659973 కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను అభినందించారు.

ఎరువుల విక్రయ కేంద్రాల్లో నిల్వ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలి: ఏడీఏ

భైంసా, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయదారులు ఎరువుల నిల్వలు, ధరలను సూచించే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భైంసా ఏడీఏ వీణా సూచించారు. మంగళవారం భైంసా పట్టణ పరిధిలోని పలు విక్రయ కేంద్రాల్లో బోర్డుల ఏర్పాటుపై సంబంధిత నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోజువారి నిల్వల సమాచారం బోర్డుపై పొందపర్చాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో భైంసా మండల వ్యవసాయ అధికారి గణేష్ పాల్గొన్నారు.

కుంటాలలో పశువైద్య శిబిరం

కుంటాల, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి ప్రియాంక, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొని నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువుల పెంపకం చేపడితే లాభాలు పొందవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా పశువులకు ఉచితంగా చికిత్సలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు.

భయం వీడితేనే విజయం: ఆర్జీయూకేటీ వీసీ



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న వీసీ

బాసర,ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): భయం వీడితే విజయం తథ్యమని బాసర ఆర్జీయూకేటీ వీసీ గోవర్ధన్ అన్నారు. మంగళవారం క్యాంపస్‌లో పీయూసీ విద్యార్థులకు పరీక్షల భయం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలు మన ప్రతిభను వెలికితీసే అవకాశాలు, వాటిని భయంగా కాకుండా భవిష్యత్తుగా చూడాలని సూచించారు. మానసిక స్థైర్యంతో జీవితం మార్చుకోగలుగుతారని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, భయం, ఆందోళనపై ముందస్తుజాగ్రత్తల గురించి కౌన్సెలర్ శ్రీనివాస్ వివరించారు. ధ్యానం, రిలాక్సేషన్ పద్ధతులు, సమయ నిర్వహణను వివరించారు.

కర్ర వరసిద్ధి వినాయక నూతన కమిటీ ఎన్నిక

తానూర్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోసి శ్రీ కర్ర వరసిద్ధి వినాయక దేవాలయం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్తమ్‌బాలేరావు, ఉపాధ్యక్షుడిగా కర్లల పెద్దనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గాడే గంగాప్రసాద్, కోశాధికారిగా తుంగెన్ శంకర్, సభ్యులుగా బాయి నాగేశ్, ఎమ్మాయి నాగప్ప, బ్యాగల్ రఘునాథ్, నీలం నర్సయ్య, దివిసి నర్సింలు, అల్లకొండ సత్యనారాయణ, తుంగెన మురళీ, నల్ల నాగేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికయిన కమిటీని గణేష్ ఉత్సవ కమిటీ అభినందించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉత్తమ్ బాలేరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కర్రవరసిద్ధి వినాయక ఉత్సవాలు వీడీసీ కమిటీ, గ్రామయువకులు, గ్రామస్థుల సహకారంతో భక్తుల ఆకాంక్షల మేరకు వైభవంగా జరపడానికి ఆ వినాయకుడి ఆశిస్సులతో కృషి చేస్తామన్నారు. ఎన్నికయిన కమిటీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావును ఈ సందర్భంగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభినందించి సన్మానించారు.

బాల్యాన్ని కాపాడుదాం

- 57 మంది పిల్లలను రెస్క్యూ చేసి తల్లిదండ్రులకు అప్పజెప్పిన నిర్మల్ పోలీసులు
- నెల వ్యవధిలో 42 కేసుల నమోదు
- నిర్మల్ ఎస్పీ డా.జి. జానకీ షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌రూరల్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1 ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ నెల వ్యవధిలో జిల్లాలోని అన్నిశాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ దిగ్విజయంగా కొనసాగిందని ఎస్పీ డా.జి.జానకీ షర్మిల తెలిపారు. మంగళవారం ఎస్పీ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌బృందం విస్తృత గాలింపు చర్యల్లో భాగంగా జిల్లాలో ముఖ్యంగా హోటళ్ల యందు, పశువులు కాసేవద్ద, వెల్డింగ్‌షాప్‌ల వద్ద, నిర్మాణ పనులవద్ద, వ్యాపార సముదాయాల వద్ద పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో బాలబాలికలు ఇంట్లో ఉన్న సమస్యలతో పాఠశాలకు బదులు పనికి వెళ్తున్నారని, దీంతో ఆపరేషన్ ముస్కాన్-11ఓ బృందం వారిని రెస్క్యూ చేసి మళ్లీ వారి జీవితాల్లో ఆశలు చిగురించేలా చేసిందన్నారు. జిల్లాలోని రెండు డివిజన్‌లలో కలిపి మొత్తం 57 మంది బాలబాలికలను గుర్తించినట్లు తెలిపారు. అందులో 42 మందిపై కేసునమోదు చేయగా మిగతా వారికి జరిమానా విధించారు. నిర్మల్ డివిజన్‌లో 25, భైంసా సబ్ డివిజన్‌లో 17 మంది బాలబాలికలను రెస్క్యూ చేసి తల్లిదండ్రులకు అప్పజెప్పి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో 50 మంది బాలురు కాగా ఇద్దరు బాలికలు ఉన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్‌గా జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డీసీపీవో మురళి, ఎస్సైలు నరేష్, సందీప్, కానిస్టేబుల్ ప్రశాంత్, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎన్జీవో సభ్యులు, రెండు డివిజన్‌లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ టీంలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి

తలమడుగు, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషనర్ సభ్యురాలు పెందుర్ నీలాదేవి అన్నారు మండలంలోని నందిగామలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అదేవిధంగా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఆదివాసులకు ఇలాంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం నందిగామ గ్రామంలోని అతి పురాతనమైన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నందిగామ గ్రామస్తులు నీలాదేవిని ఘనంగా సన్మానించారు. ఇందులో గ్రామ పెద్దలు ముడుపు కేధారేశ్వర్ రెడ్డి, గ్రామ పటేల్ సురేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జయశంకర్ జయంతి వేడుకలు

నిర్మల్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నేడు (బుధవారం) ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను పట్టణంలోని జయశంకర్ సర్కిల్ వద్ద పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



హరీశ్‌రావు ప్రసంగాన్ని వీక్షిస్తున్న మాజీ మంత్రి జోగురామన్న, నాయకులు

కమీషన్‌ల పేరిట రాజకీయ కుట్ర

● ప్రభుత్వ విధానాలపై మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వేధింపుల కోసమే కాశేశ్వరం కమీషన్‌ల పేరిట రిపోర్టులు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన రిపోర్టులు న్యాయస్థానంలో నిలబడవని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టు గురించి మంగళవారం సమగ్ర సమాచారాన్ని అందించిన నేపథ్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు పెద్దసంఖ్యలో పాల్గొని హరీశ్‌రావు ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కమిషన్‌ల పేరుతో కాలయపన చేస్తున్నారని అన్నారు. కుట్రపూరితం గానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోందని, ఎటువంటి ఆధారాలు లేని రిపోర్ట్ ఇచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, యాసం నర్సింగ్‌రావు, మర్శెట్టి గోవర్ధన్ పాల్గొన్నారు.

పొన్నారిలో వైద్య శిబిరం

తాంసి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నారిలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా శిబిరాన్ని ఏర్పాటుచేయడం చేసినట్లు తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ తులసిరాం పేర్కొన్నారు. వైద్యశిబిరంలో 187 మందికి మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలో లక్ష్మి, గంగమ్మ, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గిరిజన గ్రామాల రోడ్లు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు



బిటమిన్ లేచి గోతులు పడ్డ చాందూరి రోడ్డు



కంకర లేచి గుంతలు పడ్డ ఎందా, ఉమ్రి రోడ్డు

ఉట్నూర్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని గిరిజన గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని హస్నాపూర్ నుంచి చాందూరి వెళ్లే రహదారి పనులు దశాబ్ద కాలం క్రితం నిర్వహించడంతో రోడ్డుపై ఉన్న బిటమిన్ (డాంబర్) పూర్తిగా లేచిపోయింది. హస్నాపూర్ నుంచి చాందూరి వరకు ఉన్న రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. గతంలో పని చేసిన కాంట్రాక్టర్ సైతం వంతెనల వద్ద మొరం వేయకపోవడం, సరైన విధంగా డాంబర్ వేయకపోవడంతో రోడ్డు అనతికాలంలోనే పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హస్నాపూర్ నుంచి చాందూరు వెళ్లడానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రయాణించే ప్రజలు సైతం నరకయాతనకు గురి అవుతున్నారు. కొంతమంది ప్రజలు తమ వాహనాల ద్వారా దూరం ఎంతైనా పర్వాలేదు అంటూ చాందూరి నుంచి నడ్డంగూడ, ఎంకా, ఎంకాకాలనీ, నాగపూర్‌ల మీదుగా లింగోజి తండా ఎక్స్‌రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి ఉట్నూర్‌కు వెళ్తున్నారు. ఈ మార్గంలో కూడా ఏంకా కాలనీ, నాగపూర్, నాగాపూర్ ఎక్స్‌రోడ్డుల మధ్య ఉన్న రోడ్డు కూడా అధ్వానంగా మారింది. ఇదేకాకుండా మండలంలోని ఎందా ఎక్స్‌రోడ్డు నుంచి ఎందా, ఉదయ్‌నాయక్‌తండా, ఉమ్రి, కోలాంగూడ, నర్సాపూర్ బి గ్రామాలకు వెళ్లి రహదారికి సైతం డాంబర్ లేచిపోయి కంకర తేలి ప్రజలు నడవడానికి సైతం ఇబ్బందిగా మారింది. గత పది ఏళ్లుగా ఈరోడ్డు మరమ్మతుల విషయంలో అధికార యంత్రాంగం చొరవ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గిరిజన గ్రామాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదని గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సమస్యలపై ఏ మాత్రం చొరవ చూపలేదని, గత ఎన్నికల్లో గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీని అయినా తమ బాధలను అర్థం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాపాలన సాగిస్తున్న ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధులు తమరోడ్లను అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజలను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.



ఫటాఫట్

ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ జాగ్రతలు పాటించాలి



● డాక్టర్ ఆకాష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, భైంసా

వాతవరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల మూలంగా సీజనల్ వ్యాధుల బెడద మొదలయ్యిందని భైంసా డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ డా. ఆకాష్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు.

ప్రశ్న: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: ఈ సమయంలో అతిసారం, డయేరియా, మలేరియా వంటి వ్యాధులు వస్తుంటాయి. వాటిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు చైతన్యం కలిగించి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం.

ప్ర: ఈ సమయంలో జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

జ: ఈ సీజన్‌లో ఎక్కువగా వైరల్ ఫీవర్స్ వస్తుంటాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల మూలంగా విషజ్వరాల బెడద ఉంటుంది. దోమల బారినపడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎక్కడపడితే అక్కడ నీరు తాగకూడదు. దాని ద్వారా అతిసారం సోకే ప్రమాదముంది. వ్యాధుల బారినపడితే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

ప్ర: ఈ సీజన్‌లో ఎలాంటి ఆహారం, నీళ్ల తీసుకోవాలి.?

జ: వర్షాకాలం సీజన్‌లో ఆహార పదార్థాలు మంచినీరు విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఈ సమయంలో తాజాగా తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలి. కాచివడపోసిన నీటిని తాగితే మంచిది.

- భైంసా, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి)



రాఖీలు పంపిస్తున్న సోదరీమణులతో డిపో మేనేజర్

నిర్మల్ బస్టాండ్‌లో రాఖీ కౌంటర్

నిర్మల్ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాలకు సోదరులకు రాఖీ కట్టడానికి వెళ్లలేని సోదరీమణుల కొరకు బస్టాండ్‌లో ఆర్టీసీ ప్రత్యేక రాఖీ కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. కార్గో ద్వారా రాఖీలు పంపడానికి ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ కౌంటర్ దగ్గరకు వచ్చి బుక్ చేసినచో మీ రాఖీలు వేగంగా భద్రంగా చేరవేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కిషోర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి, కంట్రోలర్లు పీఆర్. గోపాల్, గజపతి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి : సీపీవో

ఖానాపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా సీపీవో జీవరత్నం అధికారులను ఆదేశించారు. ఖానాపూర్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, ఇసుక లభ్యత, సీజనల్ వ్యాధులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ఎటువంటి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఇందులో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్ రావు, సహా పలువురు మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

82 మంది పంచాయతీ సెక్రెటరీలకు షోకాజ్ నోటీసులు

నిర్మల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ముఖ హాజరులో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన దాదాపు 80 మంది పంచాయతీ సెక్రటరీలకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే తప్పుడు ముఖ హాజరు నమోదు చేసిన ఐదుగురు పంచాయతీ సెక్రెటరీలను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కాగా ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు విషయంలో వచ్చిన ఫిర్యాదుల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి 82 మంది పంచాయతీ సెక్రెటరీలు తప్పుడు ఎఫ్ఆర్ఎస్‌ను యాప్‌లో నమోదు చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా జిల్లాలో పలువురు పంచాయతీ సెక్రెటరీలు తాము విధులు నిర్వహించే గ్రామ పంచాయతీకి చేరుకోకుండానే తమ సొంత ఇంటి నుంచే యాప్ ద్వారా ముఖ హాజరును నమోదు చేసినట్లు గుర్తించి వారందరికీ షోకాజ్ నోటీసులను వెలువరించారు.

ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో ఘనంగా పూజలు



కుంటాలలోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కుంటాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రం కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసంలో ప్రతియేటా ఈ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో భాగంగానే మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యా శాఖలో.. కలకలం!

- డీఈవోపై ఎఫ్ఐఆర్
- మరో సిబ్బందిపై కూడా..
- కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదులు
- టీచర్ల సర్దుబాటు, డిప్యూటేషన్‌లపైనా ఆరోపణలు
- గాడి తప్పిన పరిపాలన వ్యవహారం

నిర్మల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో గత కొద్ది రోజుల నుంచి వరుసగా జరుగుతున్న పరిణామాలు కలకలం రేపుతున్నాయి. ఇక్కడి డీఈవో వ్యవహార శైలిపైనా అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే టీచర్ల సర్దుబాటు వ్యవహారంలో డీఈవో నిబంధనలు అతిక్రమించారంటూ పలు టీచర్ సంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. దాదాపు 20 మందికి పైగా టీచర్లను నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారని కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదులో ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. అయితే మొదటి నుంచి డీఈవో వ్యవహారంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలోనే ఆయన ఓ ఉపాధ్యాయ సంఘ నేతపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా ఆయనను కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ఈ ఆరోపణలపై సదరు ఉపాధ్యాయ సంఘ నేత ఏకంగా అట్రాసిటీ సెక్షన్‌ల పేరిట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మల్ పట్టణ పోలీసులు ఈ ఫిర్యాదును పరిశీలించి డీఈవోపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం విద్యాశాఖలోనే కాకుండా టీచర్ లోకంలో కూడా చర్చనీయాంశంగా మారుతోంది. అయితే డీఈవోతో పాటు ఇక్కడి కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న మరో టీచర్‌పై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెల్లడించారు. కాగా డీఈవోపై గతంలో పని చేసిన జిల్లాలో కూడా ఇలాంటి ఫిర్యాదులే వెల్లువెత్తినట్లు సమాచారం. ఆ జిల్లాలో కూడా డీఈవోపై అట్రాసిటీకి సంబంధించిన ఫిర్యాదులే వచ్చాయని తెలిసింది. దీనిపై అప్పటి ఆర్‌జెడీ కూడా విచారణ జరిపినప్పటికి ఇప్పటి వరకు ఆ నివేదికలు వెల్లడి కాలేదని అంటున్నారు. మొత్తానికి ఓ జిల్లాస్థాయి అధికారిపై అట్రాసిటీ ఫిర్యాదు కింద ఎఫ్ఐఆర్ నమోదు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.



మొదటి నుంచి అన్నీ వివాదాలే..

ప్రస్తుత డీఈవో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పద అధికారిగా ప్రచారం మొదలైందంటున్నారు. కార్యాలయ సిబ్బందిని పని భారం, పని వేళల పేరిటనే కాకుండా చిన్నచిన్న కారణాలకు సైతం వేధిస్తుంటారనే ఆరోపణలున్నాయి. ఇక్కడి సిబ్బందిపై ఆయన ప్రతినిత్యం అనుమానంతోనే వ్యవహరిస్తుంటారని, ఎవరిని కూడా పూర్తిగా విశ్వసించకుండా వ్యవహరిస్తుంటారన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కూడా ఆయన సఖ్యతగా ఉండకుండా సమస్య పరిష్కారం విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుంటారంటున్నారు. కీలకమైన జిల్లా విద్యాశాఖకు నేతృత్వం వహిస్తున్న జిల్లా విద్యాధికారి ఇటు టీచర్ల సంఘాలు, సిబ్బందితోనూ సమన్వయంగా వ్యవహరిస్తూ జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేయాల్సి ఉండగా.. ఈ అధికారి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయ సంఘాలతో సైతం ఆయన వివాదాలు సృష్టిస్తుండడం ఉపాధ్యాయులకు గౌరవం ఇచ్చే విషయంలో కూడా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారని పలు టీచర్ల సంఘాలు ఆరోపించాయి. కొద్దిరోజుల క్రితం పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డీఈవోపై స్వయంగా ఫిర్యాదు చేయడం గమనార్హం.

టీచర్ల సర్దుబాటుపైనా ఆరోపణలు

కాగా, ఇటీవలే విద్యాశాఖలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారంపై కూడా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో పాటు తమకు అనుకూలమైన ఉపాధ్యాయుల కోసం నిబంధనలను పూర్తిగా కాలరాశారంటున్నారు. సర్దుబాటు కోసం నియమించిన కమిటీ కూడా నిబంధనలను పాటించలేదన్న ఫిర్యాదులున్నాయి. ఒకచోట పని చేసే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి వస్తే.. సమీప ప్రాంతంలోని మరో పాఠశాలకు డిప్యూటేషన్ ఇవ్వాలన్న నిబంధనను తొక్కి పెట్టారంటున్నారు. ఒత్తిళ్లకు తలొగ్గిన విద్యాధికారి దూర ప్రాంతంలో ఉన్న అనుకూల పాఠశాలలకు డిప్యూటేషన్‌లు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. దాదాపు పది మందికి పైగా ఉపాధ్యాయులను ఇలా నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నేత రాజేశ్ నాయక్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. అలాగే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు, సీఎంకు సైతం ఈ విషయంపై ఆయన ఫిర్యాదులు చేయడం విద్యాశాఖలో చర్చకు తావిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారు

: రాజేశ్ నాయక్, ఎస్టీ, ఎస్సీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు



టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. నిబంధనలకు విరుద్ధంగా సమీప గ్రామాల్లో కాకుండా దూర ప్రాంతాల్లోని అనుకూలమైన ప్రాంతాల్లో ఒత్తిళ్లకు తలొగ్గి సర్దుబాటు చేశారు. డీఈవో నిర్లక్ష్యం వల్లనే విద్యాశాఖ అప్రతిష్ట పాలవుతోంది. డీఈవో వ్యవహార శైలిపైనా, అలాగే ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అక్రమాలపై తాము కలెక్టర్‌కు సమగ్ర దర్యాప్తు జరపాలని ఫిర్యాదు చేశాం.

యు డైస్ ఆధారంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్

: రామారావు, డీఈవో, నిర్మల్



యు డైస్ ఆధారంగా ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేశాం. అవకతవకలు జరగలేదు. తనపై సహజంగానే ఫిర్యాదు చేసుంటారు. ఫిర్యాదులు చేస్తేనే ఒరిజినాలిటీ తెలుస్తోంది. కాగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● అధికారులకు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలకు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపించాలని సూచించారు. సీటింగ్ ఏర్పాట్లు క్రమబద్ధంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా దేశభక్తి ప్రతిఫలించాల్సిందిగా సూచించారు. వేదిక వద్ద తాగునీరు, పండ్లు, ఫలహారాలు విద్యార్థులకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకల నిర్వహణకు ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని ముందుగా పరిశీలించి మైదానం చదును, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వేదిక అలంకరణ వంటి అంశాల్లో లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని సూచించారు. అలాగే వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర వైద్య సిబ్బంది, మందులు, అగ్నిమాపక బృందం అందుబాటులో ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో గల ప్రభుత్వ పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్యం కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఓపీ గది, మందుల గదిని, ఇంజెక్షన్ల గదిని పరిశీలించి రోగులకు అందిస్తున్నాటువంటి వైద్య సేవలపై అధికారులతో సమావేశం నిర్వహించి, ఆసుపత్రికి ప్రతి రోజు వైద్య పరీక్షలకు వచ్చే వ్యాధిగ్రస్తుల వివరాలు, మందుల వినియోగం, నిల్వలు, టీకాలు తదితర వివరాలన్ని రిజిస్టర్‌లలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మందులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది పూర్తి అంకితభావంతో వ్యాధిగ్రస్తులకు సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ప్రైవేటు వైద్యం అందుతోందన్న నమ్మకం ప్రజల్లో పెరగాలన్నారు. అంతేగాకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి. డా రాజేందర్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, వైద్యాధికారి సౌమ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చించోలి(బి)లో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్

కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్



విద్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతన్న అదనపు కలెక్టర్

నర్సాపూర్(జి), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సాపూర్(జి) లోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, స్టాక్ రూమ్, తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ వెంట నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో), నర్సాపూర్(జి) ఎమ్మార్వో శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, ఎంఈవో సాయన్న, ఏఈ హౌసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాస్, కేజీబీవీ ఎస్‌వోతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

మల్లాపూర్, మునిపెల్లి గ్రామాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

లక్ష్మణచాంద, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్, మునిపెల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని నిర్మల్‌లోని డీఎం కార్యాలయం ఎదుట మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల ప్రజలు మంగళవారం ఉదయం నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. అయితే, బస్సు సర్వీసులు లేకపోవటం వలన గ్రామస్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు తమ గమ్యస్థానాలకు చేరుకోవాలంటే.. లక్ష్మణచాంద, చామన్‌పెల్లి గ్రామాల్లో దిగి నడిచి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ వినతికి స్పందించిన నిర్మల్ డిపో మేనేజర్ పండరి బస్సు స్టేషన్ అధికారి రమణతో కలిసి మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పర్యటించారు. సర్వీసులను పునరుద్ధరిస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కమల్‌కోట రాజారెడ్డి, శేఖర్, చిన్న ఆశన్న, మహేష్, లింగవ్వ, మధులత, పద్మ, లక్ష్మీ, రాజేందర్, రాజమణి, ముత్తన్న, లతిక, మౌనికలతో పాటు మాజీ సర్పంచ్‌లు అడిచెర్ల రవి కుమార్, మాజీ ఎంపీటీసీ అడిచెర్ల శంకర్, తదితరులున్నారు.



డిపో బయట నిరసన చేస్తున్న మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల ప్రజలు

సాగునీటి కల్పనకు పెద్దపీట

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



ప్రాజెక్టు రెగ్యులేటరీ గేట్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, తదితరులు

భైంసా, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని రైతాంగ ప్రయోజనార్థం సాగు నీటి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టు భూములకు ప్రధాన గేట్ ద్వారా సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకోనప్పటికి ఆయకట్టు రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేసినట్లుగా వెల్లడించారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా 60 క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టామని తెలిపారు. తద్వారా ఆయకట్టు పరిధిలోని రైతాంగం వరి నాట్లు వేసుకునేందుకు వీలు కలుగనుందన్నారు. అంతేకాకుండా ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని చెరువులలో నీరు నింపేందుకు అవకాశం ఉందన్నారు. నియోజక వర్గ పరిధిలోని సిరాల ప్రాజెక్టు మరమ్మత్తు పనులు పూర్తయిన దృష్ట్యా ప్రస్తుత వానకాలపు పంటలకు సాగునీరు అందనుందని వివరించారు. ఇదే క్రమంలో నియోజక వర్గ పరిధిలోని పలు ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు అవసరమైన మేర నిధుల విడుదల జరిగిందన్నారు. వీటితో పాటు గత రెండు సంవత్సరాల కింద భారీ వర్షాల మూలంగా వచ్చిన వరదలతో దెబ్బతిన్న పలు ప్రాంతాల్లోని చెరువులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహింపచేసేందుకు నిధుల విడుదల జరిగిందన్నారు. తద్వారా సాగునీటి పథకాల పునరుద్ధరణ, మరమ్మత్తు పనులు చేపట్టి ఆయకట్టు భూములకు సాగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు రెగ్యులేటర్ గేట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటి విడుదల చేపట్టారు. ఇందులో ప్రాజెక్టు ఈఈ అనిల్ కుమార్, ఇంజనీరింగ్ విభాగపు అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.